# అవినీతి లేని పాలనే ధ్యేయం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**భూపాలపల్లి రూరల్:** నియోజకవర్గంలో అవినీతి లేని పాలనే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఐదు పథకాలు అమలయ్యాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్య శ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ పథకం, పేదలకు రూ.5లక్షలతో ఇళ్ల నిర్మాణం పథకాలు అమలు చేయనున్నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ ఉన్నందున పార్లమెంట్ ఎన్నికల అనంతరం మహిళలకు రూ. 2500 పంపిణీ అమలు చేస్తారని, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. 100 రోజుల్లో భూపాలపల్లి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఎంపీ ఎన్నికల్లో పేదల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించే విధంగా కార్యకర్తలు గ్రామాల్లో ప్రచారం చేయాలని సూచించారు. ఎన్నికల్లో కష్టపడ్డ కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటామని హామీఇచ్చారు. వివిధ గ్రామాల నుంచి చేరిన కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్ రెడ్డి, మండల అధ్యక్షుడు సుంకరి రామచంద్రయ్య, పార్టీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, పార్టీ నాయకులు బుర్ర కొమురయ్య, ఆకుల సంతోష్, జంపయ్య, పైడిపెల్లి రమేష్, తాటి వెంకన్న, బండి తిరుపతి, రాంనేని రవీందర్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### లీకేజీలకు మరమ్మతు



**రేగొండ(కొత్తపల్లిగోరి):** కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సమీపంలో పైప్‌లైన్ లీకేజీ కావడంతో కొన్ని రోజులుగా నీరు వృథాగా రోడ్డు పైకి వెళ్తుంది. గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌కు వివరించగా కారోబార్ నాగరాజు, సిబ్బంది సహయంతో బుధవారం లీకేజీలకు మరమ్మతు చేశారు.

### బాలిక అదృశ్యం

**మహదేవపూర్:** మండల కేంద్రంలో బాలిక అదృశ్యం అయినట్లు ఎస్సై ప్రసాద్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పలిమెల మండలం బుర్గుగుడెం గ్రామానికి చెందిన బాలిక మహదేవపూర్ మండల కేంద్రంలో ఆమె నానమ్మ పాపక్క వద్ద ఉంటూ ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుకుంది. కాగా ఇటీవల పరీక్షలు రాసి చివరి పరీక్ష పూర్తి అయినప్పటి నుంచి కనబడటం లేదు. దీంతో బాలిక నానమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**చిట్యాల:** మండలంలోని కాల్వపల్లి నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జడలపేట గ్రామ శివారులో పోలీసులు తనిఖీ చేస్తుండగా నైన్‌పాక నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేయగా డ్రైవర్ చిలుముల రమేష్ వద్ద ఏలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నేడు విస్తృత స్థాయి సమావేశం



**మంగపేట:** మండలంలోని బోరునర్సాపురంలో నేడు(గురువారం) నిర్వహించే కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి మండల స్థాయి నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బోరునర్సాపురంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశాన్ని ముఖ్య అతిథిగా పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు శ్రావన్‌కుమార్, కార్యదర్శి ఆకుతోట వెంకన్న, ఎంపెల్లి సమ్మయ్య, మండల సీనియర్ నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, మండవ రామకృష్ణ, టీవీ హిదయ్‌తుల్లా, నేలపట్ల రాంచంద్రారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

### 'హామీల అమలులో విఫలం'

**మొగుళ్లపల్లి:** ఆరు గ్యారంటీల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని బీజేపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ సురేష్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని తెలిపారు. విద్యార్థులకు నిరుద్యోగ భృతి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అర్హులైన అందరికీ గ్యారంటీలు అమలు చేసే వరకు భారతీయ జనతా పార్టీ పోరాటానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

### గుడుంబా స్వాధీనం

**చిట్యాల:** మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన పొలడుగుల బుచ్చక్క గుడుంబా అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నైన్‌పాక గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా పొలడుగుల బుచ్చక్క తన ఇంటి వద్ద గుడుంబా అమ్ముతుందనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా ఒక ప్లాస్టిక్ క్యాన్‌లో 10 లీటర్ల గుడుంబా లభించింది. దీంతో ఆమె వద్ద ఉన్న గుడుంబాను తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు


గర్మిళ్లపల్లి చెక్ పోస్ట్ వద్ద తనిఖీ నిర్వహిస్తున్న ఎస్సై ప్రసాద్

**టేకుమట్ల:** వాహనాల్లో నిషేధిత మత్తు పదార్థాలను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో మండలంలోని గర్మిళ్లపల్లిలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్ పోస్ట్ వద్ద బుధవారం ఎస్సై వాహన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అలాగే ఆధారాలు లేకుండా భారీ నగదును కలిగి ఉన్నా సీజ్ చేస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబల్ తుల రమేష్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

**గుడుంబా స్వాధీనం..**

మండలంలోని రామకిష్టాపూర్(టీ) గ్రామానికి చెందిన దుద్దేటి సమ్మయ్య అక్రమంగా గుడుంబాను విక్రయిస్తుండగా పోలీసులు స్వాధీనం పర్చుకున్నారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

## 'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి


కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ హరీశ్

**మల్హర్:** ప్రతి ఒక్కరూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ గిరి హరీష్ కోరారు. మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువు పూడికతీత పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్ ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరం దినసరి వేతనం రూ. 272 నుంచి రూ.300 కు పెరిగిందని వెల్లడించారు. కొలతల ప్రకారం పని చేస్తే ఒక్క జాబ్‌కార్డుకు ఒక్క రోజుకు రూ.300 చొప్పున 100 రోజులకు రూ.30 వేల వరకు పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మేట్స్, కూలీలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పూజారులు

**చిట్యాల:** మండలంలోని జూకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా బుధవారం మొదటిరోజు గణపతి పూజ పుణ్యవచనాలతో వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ పూజలో గ్రామంలో దంపతులు పాల్గొని పూజలు చేశారు. నేడు(గురువారం) అవాహిత మండప దేవతారాధనలు, దేవతా హోమాలు, పుష్ప ఫల ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు, రేపు(శుక్రవారం) దేవతల హోమాలు, యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ దొంతు రాంరెడ్డి తెలిపారు. అలాగే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆయలంలో పూజలు నిర్వహించారు. విగ్రహ దాతలు పోలోజు సత్యనారాయణ, విజయలక్ష్మి, గుడి నిర్మాణ దాతలు రుద్రోజు రాజమౌళి చారి, సుదర్శన్ చారి కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు దేవేందర్, ఆనంద్‌రెడ్డి, సత్యం, సాయిరెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.

## కాటారం వాసికి డాక్టరేట్



**కాటారం:** మండలంలోని బూడిదపల్లి గ్రామానికి చెందిన పొన్న మహేశ్‌కుమార్ పీహెచ్‌డీ పట్టా పొందారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో జేఎన్‌టీయూ కాకినాడ ద్వారా డాక్టరేట్ లభించింది. ఎఫిసియెంట్ అప్రోచెస్ ఫర్ డిరైవింగ్ హై యుటిలిటీస్ ఫ్రం డాటా స్ట్రీమ్స్ అనే సిద్ధాంతంపై మహేశ్ తన వ్యాసాన్ని రూపొందించారు. విజయనగరంలోని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో మహేశ్‌కుమార్ తన వ్యాసాన్ని సమర్పించారు. దీంతో జేఎన్‌టీయూ కాకినాడ కళాశాల ద్వారా మహేశ్‌కుమార్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. దీంతో మండల వాసులు, పద్మశాలి సంఘం నాయకులు, పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాదె రమేశ్, ఎలుగం సత్యనారాయణ, దోమల సమ్మయ్య, పులి అశోక్, కొండ వెంకటేశ్వర్లు, మాచర్ల రాజేందర్, గట్టయ్య, బలరాం హర్షం వ్యక్తం చేస్తూ మహేశ్‌కు అభినందనలు తెలిపారు.

## సాదాసీదాగా మండల సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి

**గోవిందరావుపేట:** మండల కేంద్రంలో ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమస్యలు సభ దృష్టికి తీసుకెళ్లాల్సిన ఎంపీటీసీలు సమావేశంలో ప్రస్తావించక పోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండల స్థాయి అధికారులు ములుగులో నిర్వహిస్తున్న ఎన్నికల శిక్షణకు హాజరయ్యారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇతర అంశాలపై చర్చలు, తీర్మానాలు చేయలేదు అన్నారు. వేసవి దృష్ట్యా అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఎంపీఓ సాజిదా బేగం, సీడీపీఓ మల్లేశ్వరీ, ఉద్యానశాఖ విస్తరణ అధికారిరమేష్, ఏపీఓ ప్రసూన్న, ఏపీఎం డీఆర్‌డీఏ నాగేశ్వరరావు, మత్స్యశాఖ అధికారి రమేష్, హెచ్‌డబ్ల్యూఓలు రేణుక, నాగరాజు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు


మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్తులు

**చిట్యాల:** మండల కేంద్రంలోని చింతలపల్లి గ్రామంలో పోచమ్మ బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బోనాలతో డప్పు వాయిద్యలతో యువకుల కేరింతలతో గ్రామ శివారులోని పోచమ్మ దేవాలయాలనికి చేరుకున్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఆకుల రవీందర్ , బుర్ర శ్రీధర్, కోడెల నంద కుమార్, పిట్టల సమ్మయ్య, రాజమల్లు, మొగిలి, పిట్టల రమేష్, ముసాపూరి సాయిలు, బుర్ర రమేష్, అల్లం రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి ఎస్సై అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న ఎస్సై ప్రసాద్

**టేకుమట్ల:** మండల కేంద్రంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన జె.వ్యోం ఇటీవల విడుదలైన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చి ఎంపికైయ్యాడు. దీంతో బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థిని ఎస్సై గోగికారి ప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మియాపురం హరీష్‌కుమార్, కానిస్టేబుల్ మధూకర్, మహిళా కానిస్టేబుళ్లు రంజిత, స్వప్న, హోం గార్డులు రాజయ్య, గంగరాజుతో పాటు తదితరులు ఉన్నారు.

## వడ్డెరులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**ములుగు రూరల్:** వడ్డెరులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గండికోట వెంకటస్వామి అన్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని మంత్రి వర్గ సమావేశంలో 16 కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వడ్డెర కార్పొరేషన్ విస్మరించారని అన్నారు. రాష్ట్రంలో వడ్డెరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సారంగపాణి, రమేష్, వెంకటేశ్, సంతోష్, సిద్దు, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి మధ్యలో విద్యుత్ స్తంభాలు


రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

**వాజేడు:** మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం గ్రామం వద్ద జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. రహదారి పనులు కొనసాగుతున్నప్పటికీ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు అలానే ఉన్నాయి. ఆ స్తంభాలను రహదారి మధ్యలో నుంచి తొలగించి ఇరువైపులా వేయాల్సి ఉంది. కాని స్తంభాలు అలా ఉండగానే రహదారి పనులను సదరు కాంట్రాక్టర్ చేసుకుంటూ వెళ్తున్నారు. పొరపాటున ఏదైనా వాహనం విద్యుత్ స్తంభాలకు తగిలితే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. స్తంభాలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేసి ధర్నా చేస్తున్న నాయకులు

**మహదేవపూర్:** మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడు ఎంపీ స్థానాలు ఎస్సీలకు రిజర్వేషన్ ఉంగా ఒక స్థానానికి కూడా మాదిగా సామాజిక వర్గానికి కేటాయించలేదన్నారు. దీంతో మందకృష్ణ మాదిగా పిలుపు మేరకు ధర్నా నిర్వహించి సీఎం దిష్టిబొమ్మ దహనం చేసినట్లు తెలిపారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడు దుర్గయ్య, రవితేజ, సదనందం , శ్రీకాంత్, కూమార్, తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు


మంగపేట: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం అప్పారావు


వాజేడు: కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సిబ్బంది

**మంగపేట:** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలని జ్యోతి మండల సమాఖ్య(ఐకేపీ)సెర్ప్ ఏపీఎం అప్పారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సెర్ప్(డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ శ్రీనివాస్, జనార్ధన్, వీఓఏ సత్యవతి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

**వాజేడు:** వాజేడు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో సిబ్బంది వాజేడు, పేరూరు, ప్రగళ్లపల్లి, శ్రీరామ్‌నగర్ గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న మిత్ర బృందం

**చిట్యాల:** మండలంలోని జడలపేట గ్రామ శివారు గాంధీనగర్‌కు చెందిన బొట్ల రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దింతో అతడితో కలసి 2008 నుంచి 2010 వరకు జనగామ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న మిత్రులు ఆ కుటుంబానికి రూ.20,500 ఆర్థిక సాయం అందించారు. మృతిడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ ఇంటి కుటంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి ఆసరాగా నిలిచిన మిత్రులకు గ్రామస్తులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్ర బృందం పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

**వాజేడు:** వాజేడు మండలంలో పోలీసులు బుధవారం వాహన తనిఖీలను ముమ్మరంగా చేశారు. వాజేడు ఎస్సై వెకటేశ్వరరావు మండల పరిధిలోని ప్రగళ్లపల్లి గ్రామం వద్ద వాహనాలను తనిఖీ చేశారు. పేరూరు ఎస్సై రమేష్ చంద్రుపట్ల గ్రామ సమీపంలో 163 నంబర్ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు.

**గోవిందరావుపేట:** ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మండల కేంద్రంలోని పస్రా గ్రామంలో జాతీయ రహదారిపై పస్రా సీఐ శంకర్, ఎస్సై కమలాకర్ వాహనాలను తనిఖీలు చేశారు. ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తుల రవి

**మంగపేట:** మండలంలోని కమలాపురంలో జ్వాలా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రాధా స్టీల్ ప్రతినిధులు, గ్రామ పంచాయతీ, మంగపేట పోలీసుల వారి సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని మండల స్పెషలాఫీసర్ తుల రవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుతున్న ఎండల తీవ్రతకు ప్రజలకు దహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జ్వాల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోడెల నరేష్, సభ్యులు సతీష్, మహేష్, సయ్యద్ బాబా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.